జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
99489 95556
చందాలకు
98489 66190

స్థాపితం : 1930
LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM
స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 79 సంచిక 2 11-1-2008 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-





### ప్రజలా, పదవులా దేని కోసం రావాలి?

# చిరంజీవి మనసులో మెదలుతున్న ప్రశ్న!

చిరంజీవి రాజకీయప్రవేశం ఇంకా అస్పష్టంగానే వుంది; అయోమయం లోనే వుంది. ఎందరెన్ని రకాలుగా పిలిచినా, ప్రాధేయపడినా, ప్రోత్సహించినా బెల్లం కొట్టిన రాయి వలె వుండి పోతున్నాడు చిరంజీవి. వస్తానని చెప్పడు, రానని తేల్చడు. ప్రజలకే కాదు, తన ఇంట్లోని వారితో కూడా ఆయన అదే మౌనం పాటిస్తున్నారట. ఈ నిరీక్షణ ఎప్పటికి ఫలిస్తుందో అర్థం కాక, ఆయన తమ్ముళ్లు నాగబాబు, పవన్ కళ్యాణ్ కూడా అసహనానికి లోనౌతున్నారు. ఒక్క అల్లు అరవింద్ మాత్రమే చిరంజీవితో ఈ విషయం చర్చించగల్గుతున్నాడని వినికిడి.

ఏ పని చేయబోయే ముందైనా వెనుకా ముందు చూసుకోవడం, ఆలోచించుకోవడం, ఆంతరంగికులతో చర్చలు జరపడం, లాభనష్టాల లెక్క చూసుకోవడం అవసరమే కానీ, వాటితోనే పొద్దు పుచ్చడం మాత్రం తెలివైన పని కాదు. అతిజాగ్రత్త ఒక్కొక్కసారి అనర్థాలకు దారి తీస్తుందే తప్ప, మంచి చేయదు. ఈ వూగిసలాట వల్ల చిరంజీవి పట్ల ప్రజలలో పెల్లుబుకుతున్న మోజు నీరసించి పోతుందన్నది ఆయన అభిమానుల ఆవేదన. నాన్న పులి సామెత లాగా, రేపు నిజంగానే రావాలనుకున్నప్పుడు ఎవరూ నమ్మని పరిస్థితి ఏర్పడుతుందన్నది అందరి భయం.

ఇంతకూ చిరంజీవి ఇంత వూగిసలాటకు కారణం ఏమిటి అన్నది ప్రశ్న. అసలు ఎవరి కోసం తాను రాజకీయాలలోకి రావాలి అన్న ప్రశ్న ఆయన మనసును మథిస్తున్నదని ఆంతరంగికులు చెప్తున్నారు. రాజకీయాలలోకి వస్తే, నేరుగా ముఖ్యమంత్రి పదవి అధిష్టించేస్థాయిలో వుండాలన్నది ఆయన అభిమానుల కోరిక. ఒకవేళ ఎంత ప్రయత్నం చేసినా స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయిలో తన పార్టీ గెలవనప్పుడు ఏమి చేయాలో చెప్పండని అడుగుతున్నారట, తన కుటుంబసభ్యులను. వారిలో అధికులకు ఆ ప్రశ్నే రుచించడం లేదు. చిరంజీవి ప్రజలలోకి వెళ్తే, ప్రభుత్వం దానంతట అది చేతికి వచ్చేస్తుందని వారి నమ్మకం.

కేవలం ముఖ్యమంత్రి కావడం కోసమే రాజకీయాలలోకి ప్రవేశించడం సమంజసమా? ముఖ్యమంత్రి అయినంత మాత్రాన తనకు వచ్చే అదనపు ప్రయోజనం ఏమి వుంది? ఇంతకంటే జనాభిమానం, ఇంతకంటే సిరి సంపదలు వస్తాయా? వాటికోసం ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకుని కష్టపడాలా? రాజకీయాలలోకి రావడం అంటూ జరిగితే ప్రజల కోసం వుండాలి కానీ, పదవుల కోసం కాకూడదు అన్నది చిరంజీవి ఆలోచనని చెప్తున్నారు. పదవులు లక్ష్యం కానప్పుడు ఎన్నికలలో గెలుపు ఓటములు లెక్కలోకి రావు. వాటిని లెక్కించనవసరం లేనప్పుడు, తన పార్టీలోకి రావాలనుకునే ఇతరపార్టీ నేతలను జల్లెడ పట్టవచ్చు. అవినీతి, అధికార దాహం

తరువాయి 14వ పేజీలో

### రెండో ఎస్సార్సీతో కాంగ్రెస్‌కు సజీవ సమాధి

# మోసంతో సాధించేది పతనమే!

మూడుకోట్ల మంది ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన సమస్య ప్రత్యేక తెలంగాణా. దాని వెనుక ఐదు దశాబ్దాల పోరాటం వుంది; వేలాది మంది ప్రాణ బలిదానం వుంది; ఆత్మ గౌరవ వాంఛ వుంది; స్వయంపాలనాభిలాష వుంది. తమకు అన్యాయం జరుగుతున్నదన్న ఆవేదన వుంది; తమ వనరులు దోపిడీకి గురౌతున్నాయన్న ఆందోళన వుంది. అందువల్లనే ఎప్పుడు ఎవరు తెలంగాణా నినాదం విన్పించినా, ప్రజలు స్పందిస్తున్నారు; పోరుకు పిలిస్తే కదలి వస్తున్నారు; అవకాశం దొరికినప్పుడల్లా తమ కోరిక విన్పిస్తున్నారు. దాన్ని చూసే గత శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్‌తో చెలిమి చేసింది. పొత్తు పెట్టుకుని సీట్లు పంచుకున్నది; ప్రచారంలో గులాబీ కండువాలు వేసుకొని తిరిగింది; ప్రత్యేక తెలంగాణా ఇస్తామని చేతిలో చేయి వేసి చెప్పింది. ఓట్లు గెల్చుకున్నది. ప్రభుత్వం నెలకొల్పింది. పదవులననుభవించింది. తెలంగాణా కోరికను మాత్రం ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. ప్రణబ్ కమిటీ అని, సోనియా గాంధీ నిర్ణయమని, వర్కింగ్ కమిటీ తీర్మానమని, ఏకాభిప్రాయసాధనని, అన్ని పార్టీలతో చర్చలని రక రకాల కుంటిసాకులు చూపింది. మధ్యమధ్యలో ప్రజలను నమ్మించడానికి రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన తెచ్చింది; ప్రధాని నోట ఎర్రకోట మీద నుంచి పలికించింది. అంతా అయిపోయాక, మళ్లీ ఎన్నికల పండుగ దగ్గర పడ్డాక, రెండో ఎస్సార్సీ అని కూనిరాగం తీస్తున్నది.

రెండో ఎస్సార్సీ అంటే, ఇప్పటిలో తెలంగాణా ఇచ్చే ఆలోచన లేదని తెల్చి చెప్పడమన్న మాట. దేశంలో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నియమించే రాజకీయ వాతావరణం ఎంత మాత్రం లేదు. దాన్ని వేయడం అంటే కందిరీగల తుట్టెను కదిలించడంతో సమానం. ఉత్తరప్రదేశ్‌లో, ఒరిస్సాలో, మహారాష్ట్రలో, పశ్చిమ బెంగాల్‌లో, ఈశాన్య ప్రాంతాలలో, గుజరాత్‌లో, ఇంకా పలు చోట్లలో ప్రత్యేక రాష్ట్ర కోరికలున్నాయి. రెండో ఎస్సార్సీ వేస్తే వాటన్నిటికీ ప్రాణం లేచి వస్తుంది. మరొకప్రక్క రాష్ట్రాలలోనే కలతలున్నాయి. సరిహద్దుల విషయంలో, సరిహద్దు గ్రామాల విషయంలో, కొన్ని జిల్లాల విషయంలో రాష్ట్రాల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. వాటన్నిటికీ జీవం కల్గుతుంది.

తరువాయి 14వ పేజీలో







### నియోజకవర్గాల పునర్విభజన, చిరంజీవి పార్టీ ప్రచారంతో

# కాంగ్రెస్, దేశం వాదుల్లో కల్లోలం, కలవరం!

ఈ ఎన్నికలకే అమలుకానున్న నియోజకవర్గాల పునర్విభజన ఒక ప్రక్క, చిరంజీవి పార్టీ సృష్టించబోయే ప్రభంజనం మరొక ప్రక్క తమలో తమకు పెరిగిపోతున్న అంతఃకలహాలు మూడవ ప్రక్క జిల్లా కాంగ్రెస్ వాదులను కల్లోలానికి గురి చేస్తున్నాయి. కలవర పెడుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడేకొద్దీ ఎవరి బ్రతుకు ఏమిటో, ఎవరి భవిష్యత్తు ఎట్లా ఉంటుందో అర్థం కాక సతమతమౌతున్నారు. పునర్విభజన వల్ల జిల్లాలో నియోజక వర్గాల స్వరూపం చాలా మారిపోతున్నది. అన్ని నియోజక వర్గాలు తమ రూపురేఖలను మార్చుకొంటున్నాయి. పుట్టి బుద్దెరిగిన నాటి నుంచి తమకు తెలిసిన గ్రామాలు, ప్రాంతాలు కాకుండా కొత్త ప్రదేశాలలో ఓట్లు అడుక్కోవలసిన పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. ఈ సంకటం తెలుగుదేశం పార్టీకి కూడా వర్తిస్తుంది. పార్టీలో వల నేతల మధ్య సమన్వయం, సయోధ్య ఉంటే మారిన ఊళ్లలో కూడా తమతమ పార్టీల ప్రతినిధులు ఉంటారు కాబట్టి కొత్తన్నది లేకుండా రాజకీయం నడిపించుకోవచ్చు. కానీ రెండు పార్టీలలోనూ ఆ ఒద్దిక ఎంతమాత్రం లేదు. ఒకరిని ఒకరు పొడుచుకోవాలన్న తహతహ మాత్రమే కన్పిస్తున్నది.

నిజానికి కాంగ్రెస్ చరిత్రలో లేనంత ఉత్కృష్ట స్థాయిలో అధికారాన్ని అనుభవిస్తున్నారు ఎమ్మెల్యేలు. అడగని వాడిది పాపం అన్న తీరులో ఎమ్మెల్యేలు ఏ అడ్డమైన పనికోరినా కాదనక చేసి పెడుతున్నాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. దాన్ని ఆసరా చేసుకుని ఒక్కొక్క ఎమ్మెల్యే కోట్లకు పడగలెత్తుతున్నారు. డబ్బు మీద మోజులేకుండా, ఎన్నికలలో తప్ప మరెప్పుడూ ఆప్రమేయం రానివ్వకుండా రాజకీయం చేస్తారనే పేరున్న ఆనం కుటుంబం కూడా ధనరాశులు పోగు చేసుకునే పనిలో నిమగ్నమై పోయి ఉంది ఇప్పుడు. అది చూసి తతిమా ఎమ్మెల్యేలు కుళ్లుకొంటున్నారు. తమకు తోచిన రీతిలో తామూ ఆర్జించాలని తాపత్రయ పడుతున్నారు. ఈ అవినీతి కక్కుర్తి వల్ల కూడా ఒకరి మధ్య మరొకరికి పోటీలు, కక్షలు పెరిగిపోతున్నాయి.

నియోజకవర్గాల మార్పువల్ల అందరికంటే ఎక్కువగా కలవర పడుతున్నది కేంద్రమంత్రి పనబాక లక్ష్మి. నెల్లూరు ఎమ్పీ స్థానం జనరల్ కావడంతో పూర్తిగా కొత్తచోటు వెతుక్కోక తప్పడంలేదామెకు. ఎక్కడా చోటుదొరికే అవకాశం కనపడక అయోమయానికి గురౌతున్నారు. ఇటువంటి పరిస్థితి వస్తుందని ఎంతమాత్రం ఊహించలేక జిల్లాలో వర్గరాజకీయాలకు శ్రీకారం చుట్టిందామె. ఒకప్రక్క నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డితో, మరొక ప్రక్క ఆనం సోదరులతో రాజకీయ క్రీడ నడిపారు. దానిఫలితంగా ఇప్పుడామెను పలకరించే దిక్కు లేకుండా పోయారు. తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన జనార్ధన్‌రెడ్డి మీదనే అకారణంగా యుద్ధం ప్రకటించి, ఆయన్ను మానసిక వేదనకు గురి చేసిందన్న భావన ఒక్క నెల్లూరు జిల్లాలోనే కాకుండా, మొత్తం రాష్ట్రపార్టీ నేతలలో కూడా ఉంది. అందువల్ల ఆమెను తమ జిల్లాలకు లేదా నియోజక వర్గాలకు పిలిచే వారు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి వైఎస్‌కు కూడా ఆమె మీద సదభిప్రాయం లేదని చెప్తారు. కేవలం ఢిల్లీలో తనకున్న పరిచయాలు, పలుకుబడుల ఆధారంగా రేపటి ఎన్నికలలో టిక్కెట్

కొరవ 14వ పేజీలో



















## బుచ్చిప్రభుత్వాస్పత్రిలో యమ కింకరి

ప్రాణం పోసేవాడు దేముడైతే, ప్రాణాలు కాపాడేవారు డాక్టర్లని ప్రజలు నమ్ముతారు. అందుకే వైద్యులంటే ప్రతి ఒక్కరికి గౌరవం, భక్తి. సమాజంలో మరే వృత్తికిలేని గౌరవ మర్యాదలు, వైద్య వృత్తికి వున్నాయి. కానీ బుచ్చి రెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలలో పని చేసే డాక్టర్ జయమ్మ మాత్రం ప్రాణాలు తీసే యమకింకరిణిలా మారింది. వైద్యం

### డాక్టర్ జయమ్మ వైద్యానికి మరొకరుబలి

అందించడంలో నిర్లక్ష్యం వహిస్తూ ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు బలిగొన్న జయమ్మ మరో బాలింత ప్రాణాలు హరీ మనిపించింది. ప్రభుత్వ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తూ, పక్కనే ఆదిత్య హాస్పిటల్ పేరుతో ప్రైవేట్‌గా చికిత్స అందిస్తోంది. ఈమె సక్రమంగా వైద్యం అందించకపోవడం, తదితరకారణాల వల్ల ఇప్పటికి ముగ్గురు బాలింతలు మృతి చెందగా, మూడురోజుల

కొరవ 14వ పేజీలో



నెల్లూరు ట్రంకురోడ్డులో టాటా గోల్డ్ ప్లస్ షోరూంను ప్రారంభిస్తున్న టైటాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నగల విభాగం ఉపాధ్యక్షుడు ఎల్.ఆర్.నటరాజన్. ప్రక్కన షోరూం నిర్వాహకులు శరవణకృష్ణ, చంద్రశేఖర్ వున్నారు.

## పండుటాకులపై ప్రేమ చూపండి!

వృద్ధుల పట్ల సమాజం చిన్న చూపు చూస్తున్నదని, ఈ పద్ధతి మారాలని కోరుతూ కలకత్తాకు చెందిన తపన్‌కుమార్‌దాస్ తీర ప్రాంతం వెంట పర్యటన చేపట్టాడు. గుజరాత్ నుంచి పర్యటన ప్రారంభించిన దాస్ మైపాడు సాగర తీరానికి చేరుకొన్నాడు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మారుతున్న కాలంలో వృద్ధులను ఆయా

### కలకత్తా యువకుడి ప్రచారం

కుటుంబాల వారు దూరం చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో మంచాన పడ్డ తల్లిదండ్రులు, వృద్ధులకు సేవ చేయకుండా వృద్ధాశ్రమంలో చేర్పించడం, సక్రమంగా చూడకపోవడం పట్ల ఆయన బాధను వ్యక్తం చేశారు. యువత ఎంత ఉన్నత స్థితికి చేరినా తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, వారిని ఆదరించాలని సందేశం ఇవ్వడమే తన

కొరవ 14వ పేజీలో

# ఎర్రచందనం స్మగ్లింగ్ దర్యాప్తు బాధ్యత సిబిఐకి!

ఇప్పటి వరకు పోలీసు, అటవీ శాఖాధికారులను ముప్పతిప్పలు పెడుతున్న ఎర్రచందనం స్మగ్లర్ల వెన్నులో వణుకు మొదలైంది. దీనికి కారణం ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారాన్ని అరికట్టేందుకు కేంద్ర పరిశోధనా విభాగాన్ని (సిబిఐ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దింపడమే. సిబిఐ ఈ అక్రమ రవాణాను చేధించేందుకు వస్తున్నదని తెలియగానే స్మగ్లర్లకు ఇంత కాలం ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్న పోలీసు, అటవీశాఖ అధికారులతోపాటు రాజకీయ నాయకులకు చెమటలు పడు

### పోలీసు, అటవీ శాఖాధికారుల్లో వణుకు

తున్నాయి. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని కొండ క్రింద గ్రామాల్లో అక్రమంగా నరికిన ఎర్రచందనాన్ని చెన్నై, ఒరిస్సా తదితర ప్రాంతాలకు చేరవేసి ఓడల ద్వారా జపాన్ దేశానికి తరలిస్తున్న సంగతి తెలిసిందే. సిబిఐ ఇప్పటికే దీనిపై లోతైన దర్యాప్తు ప్రారంభించింది. ఎర్రచందనం స్మగ్లర్ల జాబితాను రాష్ట్ర నిఘా విభాగాలు ఇప్పటికే సిబిఐకి అందజేశాయి. నెల్లూరు, చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి భారీ స్థాయిలో ఇతర దేశాలకు ఎర్రచందనం తరలివెళ్తున్నట్లు గుర్తించారు. గతంలో నెల్లూరు డిఎఫ్‌ఓగా పని చేసిన వెంకయ్య చెన్నైలో అంతర్జాతీయ స్మగ్లర్ల స్థావరంపై దాడి చేసి ఆరు కోట్ల విలువైన ఎర్రచందనం కంటైనర్లను పట్టుకొ

కొరవ 14వ పేజీలో



నెల్లూరు సెంట్రల్ జైలులో ఖైదీలకు గోమతి స్కూల్ నేతృత్వంలో స్వీట్లు పంచుతున్న శాసనమండలి సభ్యుడు బూదాటి రాధయ్య, అరుణ తదితరులు.



నెల్లూరు ఎస్టీడీ హోంలో భారతీయ ఆదిమజాతి సేవక్ సంఘం నేతృత్వంలో జరిగిన బాల సేవికుల శిక్షణా శిబిరం వేదికపై డాక్టర్ రాజమ్మ తదితరులున్నారు.

## కలెక్టర్‌పై సోమిరెడ్డి విమర్శనాస్త్రం!

ప్రజలకు, పేదవారికి సేవచేయాల్సిన కలెక్టర్ మంత్రులు, ఎమ్మెల్యేల సేవలో తరిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముత్తుకూరు మండలంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ తీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమౌతున్నది. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం లేదు. వారి సమస్యలు పరిష్కరించడం లేదు. ఎమ్మెల్యేలు, మంత్రులతోనే పొద్దు పుచ్చుతున్నాడు. జిల్లా

### ప్రజలను పట్టించుకోరా?

కలెక్టర్‌గా ఈ పద్ధతి సరికాదు. సుబ్బారెడ్డి పాళెంలో గతంలో పేదలకు పంచిన్న వెయ్యి ఎకరాలను మళ్లీ మొదటి విడత భూ పంపిణీ అంటూ అదే భూమిని 62 మందికి ఇచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకరరెడ్డి ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారు. తోటపల్లిగూడూరులోని ఆదాలకు చెందిన ప్రిన్స్ స్కూల్‌లో విద్యార్థులకు ఒక్కొక్కరికి 630 రూపాయలు ఇస్తున్నారని, ప్రభుత్వ హాస్టల్‌లో వుండే ఒక్క విద్యార్థికి 450 రూపాయలు మాత్రమే ఇవ్వడమేమిటని, దీనిపై కలెక్టర్ విచారణ జరిపించాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు.



నెల్లూరులో రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మోటార్ సైకిల్ ర్యాలీని జెండా వూపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ మల్లారెడ్డి.

## మసిబారుతున్న నవోదయ కీర్తి!

మర్రిపాడు మండలం కృష్ణాపురంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడపబడుతున్న నవోదయ విద్యా సంస్థకు ఎంతో పేరుంది. పాతికేళ్ల కిందట అప్పుడు ఎమ్మెల్యేగా వున్న ప్రస్తుత నరసరావుపేట ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పోరాడి మరీ ఈ విద్యాలయాన్ని కృష్ణాపురంలో ఏర్పాటు చేయించారు. మేకపాటి సోదరుల 30 ఎకరాల నిమ్మతోటను పాఠశాల కోసం దానం చేయడంతో ప్రజల్లో వారికి మంచి పేరు వచ్చింది. విద్యా ప్రమాణాలపరంగా ఏడాదికి ఏడాది పురోగతి సాధిస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అపఖ్యాతి పాలవుతున్నది. గతంలో హర్యానాకు చెందిన ఇద్దరు విద్యార్థులు

### సిబ్బందే కారకులు

స్కూలు నుంచి ఈతకని వెళ్లి వాగులో పడి మృతి చెందారు. మరో విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ సంఘటనలకు విద్యార్థులదే తప్పంటూ పాఠశాల సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన ఆటల పోటీలకు వెళ్లిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకొంది. ఉపాధ్యాయుడి ప్రవర్తన కారణంగానే బాలిక

కొరవ 14వ పేజీలో

# చూస్తే చాలు అమర్‌నాథ్ యాత్ర చేసిన అనుభూతి!

హిమాలయాలలో వున్న అమర్‌నాథ్‌యాత్ర చేయా లనే కోరిక వున్నా దానిని నెరవేర్చుకోలేనివారు ఆ అనుభూతిని పొందేందుకు నెల్లూరు నగరంలోని వై.ఎం.సి.ఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ హ్యాండిక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చు.

ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలను బాగా ఆకర్షిస్తున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన 300 మంది కళాకారులు నెల

> నెల్లూరు వైఎంసిఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోని అమర్‌నాథ్ యాత్ర సెట్టింగ్ జనాన్ని ఆకట్టుకొంటున్నది.

రోజుల పాటు శ్రమించి 324 అడుగుల పొడవు 182 అడుగల వెడల్పుతో ప్లాస్టర్‌ఆఫ్‌పారిస్, గన్ని బ్యాగ్స్, సవకలను వుపయోగించి అమర్‌నాథ్ యాత్ర సాగే హిమగిరులను పోలిన సెట్స్‌ను నిర్మించడం గొప్ప విశేషంగా చెప్పవచ్చు.

రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఎగ్జిబిషన్ ప్రతి సంవత్సరం కొత్త రకమైన ప్రత్యేకతలతో ముందు కెళ్తున్నది. ఇందులో భాగంగానే 2008 నూతన సంవత్సరం సందర్భంగా మొట్ట మొదటిసారిగా నెల్లూరు నగరంలో అమర్‌నాథ్ యాత్రను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. కోటిరూపాయల వ్యయంతో అమర్‌నాథ్‌యాత్ర సెట్టింగ్, ఎగ్జిబిషన్‌లో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా వుంది.

మగువలను ఆకర్షించే పలు వస్తువులు, గృహోపకరణాలు, జెయింట్‌వీల్, అమెరికన్ క్రాకరీస్, రెడీమేడ్ దుస్తులు, హస్తకళల వస్తువులు వున్నాయి. డాషింగ్ కార్, స్లిమ్‌బాంబు, కొలంబస్, టోరా బోరా, రేంజర్ బాంబర్‌బోట్ తదితర ఆటవస్తువులు చిన్నారులను ఆకర్షిస్తున్నాయి.

ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ 60 రోజుల పాటు నగరంలో వుంటుంది. ఈ ఎగ్జిబిషన్ ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జనం సందర్శించవచ్చు. మూడు సంవత్సరాలు దాటిన వారందరు అమర్‌నాథ్ యాత్ర ప్రవేశం పొందేందుకు 40 రూపాయల టిక్కెట్ తీసుకోవాల్సి వుంటుంది.

అమర్‌నాథ్ యాత్ర టిక్కెట్ తీసుకొన్న వారికి ఎగ్జిబిషన్ ప్రవేశం ఉచితంగా కల్పిస్తారు. అమర్‌నాథ్ యాత్ర కాకుండా కేవలం ఎగ్జిబిషన్ మాత్రమే చూడాలనుకునేవారు 10 రూపాయల టిక్కెట్టు తీసుకొంటే సరిపోతుంది. నగర ప్రజలకు పండుగ రోజులలో ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌లోని అమర్‌నాథ్ యాత్ర సందర్శించే తీరిక చేసుకోండి.


ఎగ్జిబిషన్‌లో కృత్రిమంగా ఏర్పాటు చేసిన అమర్‌నాథ్ యాత్రలో ఓ దృశ్యం.

# యువతను ఆకర్షిస్తున్న ఐప్యాడ్‌లు



బూచోడమ్మా బూచోడు బుల్లి పెట్టిలో వుంటాడు...కళ్ళకు ఎప్పుడు కనపడడు... కబుర్లెన్నో చెబుతాడని పాత కాలంలో రేడియోలు కొత్తగా వచ్చినపుడు అనుకొంటుండేవారు. అలాంటిది రేడియోలు, ఆ తర్వాత టీవిలు, విసిడి, డివిడిలు, ఎఫ్ఎమ్ రేడియోలు, ఇలా ఎన్నో ఎన్నెన్నో కొత్త కొత్త ఎలక్ట్రానిక్ వస్తువులు, పరికరాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అలాంటి వాటిలో చెప్పుకోతగింది ఐప్యాడ్స్. అరచేతిలో ఇమిడిపోయేలా వుండే ఈ ఐప్యాడ్స్ కొత్తగా వచ్చినపుడు కేవలం పాటలు వినే సదుపాయం మాత్రమే వుండేది. ఆ ఐప్యాడ్స్‌లో వుండే మెమరీ పవర్‌నుబట్టి వంద, రెండు వందల నుంచి ఎక్కువ సంఖ్యలో పాటలు లోడ్ చేసుకొని వినే అవకాశం వుండేది. ఈ ఆడియో ఐప్యాడ్స్ స్థానంలో దృశ్యాన్ని చూసే అవకాశం వుండే వీడియో ఐప్యాడ్స్ ఇప్పుడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. రెండువందల పాటల నుంచి ఐప్యాడ్‌లో వందల సంఖ్యలో పొందుపరచుకొని చూసే సదుపాయం వీటిలో వుండే ప్రత్యేకత. వివిధ రకాల కంపెనీలు ఈ వీడియో ఐప్యాడ్‌లను తయారుచేసి అందిస్తున్నాయి. ఆడియో, వీడియో ఐప్యాడ్‌లు, ఓన్లీ ఆడియో ఐప్యాడ్‌లతోపాటు అదనంగా వీటికి కెమెరాను అమర్చి వుండంతో పాటలను వినడం, దృశ్యాలను చూడడమే కాకుండా రెండుగంటల పాటు వీడియో తీసుకొనే సదుపాయం ఈ ఐపాడ్‌లలో వుంది. డిజిటల్ కెమెరాలను పోలి వుండే ఈ ఆడియో, వీడియో ఐప్యాడ్‌లు ఎంపి3, ఎంపి4 ప్లేయర్లుగానూ పనిచేస్తున్నాయి. వీటిని టీవిలు, కంప్యూటర్‌లకు అనుసంధానం చేసి వీటిలో వుండే దృశ్యాలను టివి, కంప్యూటర్ల స్క్రీన్‌పై చూసే వీలు వుంది. ఆడియో సౌకర్యం మాత్రమే వుండే ఐప్యాడ్‌లు 1300 రూపాయల నుంచి 2000 రూపాయలుగా ధర పలుకుతుండగా, వీడియో ఐపాడ్‌లు రెండువేల రూపాయల నుంచి ఆరు వేల రూపాయలలో దొరుకుతున్నాయి. ఎక్కడికైనా సులభంగా తీసుకొనిపోయేందుకు, చేతిలో ఇమిడి పోయేలా వుండే ఐప్యాడ్‌లు యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయని చెప్పవచ్చు.

# కాంతులీనే వృక్షాలు

పచ్చని వాతావరణంలో ఇళ్లుండాలని పలువురు కోరుకుంటారు. ఇంటి లోపల ఏ మాత్రం స్థలం వున్నా చెట్లు వేసుకోవడానికి, పూలమొక్కలు పెంచుకొనేందుకు ప్రయత్నిస్తారు. ఇంటి లోపల చిన్న చిన్న కుండీలలో ఒదిగిపోయే మొక్కలను, బోన్సాయ్ మొక్కలను పెంచుతారు. మొక్కల పెంపకం, వాటి పోషణ కొంచెం కష్టతరం కావడంతో ఆర్టిఫిషియల్ మొక్కలను, పూలను వాడుతుండడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. ఉరుకుల పరుగుల జీవనంలో మొక్కల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల సమయం దొరకనంతగా బిజీ అయిపోయారు. ఈ పరిస్థితులలో బజార్లలో దొరికే ఆర్టిఫిషియల్ పూలమొక్కలు కొని తమ గృహాలలో, గదుల్లో ఏర్పాటు చేసుకొనేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని రకరకాల పూలను, మొక్కలను ప్లాస్టిక్, ఫైబర్ మెటీరియల్‌తో తయారుచేసి మార్కెట్‌లోకి తీసుకొని వస్తూ వున్నాయి పలు కంపెనీలు. అచ్చంగా నిజమైన పూల మొక్కలను పోలివుండడంతోపాటు రాత్రి సమయాలలో మిరుమిట్లు గొలిపే కాంతులను వెదజల్లేలా ఆ పూలచెట్లకు విద్యుత్ దీపాలను అమర్చి వుండేవి కొత్తగా వస్తున్నాయి. విద్యుత్ సహాయంతో పనిచేసే ఈ లైట్లు బోన్సాయ్ మొక్కలను పోలి వుండే ఆర్టిఫిషియల్ చెట్లకు అమరుస్తున్నారు. దూరం నుంచి చూస్తే అది నిజంగా బోన్సాయ్ మొక్క అనేంతగా వుండే ఈ చెట్లు లైట్లు అమర్చడంతో మరింతగా వెలుగులు చిమ్ముతూ ఆకర్షణీయంగా వుంటున్నాయి. రకరకాల పూలు అమర్చిబడి వుండే ఈ ఆర్టిఫిషియల్ లైటింగ్ ట్రీస్ గృహాలకు అదనపు అందాన్ని తీసుకొని



వస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. రెండువందల రూపాయల నుంచి ఐదు వందలకుపైగా ధరలలో ఈ లైటింగ్ ట్రీస్ దొరుకుతున్నాయి. కొత్త ఐటమ్స్‌తో తమ ఇళ్లను అలంకరించుకోవాలని అనుకొన్న వారు ఆర్టిఫిషియల్ లైటింగ్ ట్రీస్‌ని కొనుగోలు చేయవచ్చు.




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

## పాఠకులకు ప్రత్యేక కానుక

డెబ్బయ్ తొమ్మిదేళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో కొంగ్రొత్త కానుకగా "సమయ్" అలారం టైమ్ పీస్ అందిస్తున్నాము.
1-12-2007 నుండి 31-3-2008 మధ్య
సంవత్సర చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

**సంవత్సర చందా రూ.200**

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు
వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా పత్రిక - జమీన్‌రైతు వారపత్రిక





# మదన్, బర్నాబాసులకు గోడ కుర్చీ!

నెల్లూరు నగరంలో ప్రశాంతమైన ప్రాంతం పొదలకూరురోడ్డులోని లేక్ వ్యూకాలనీ. ఈ ప్రాంత ప్రజలకు నూతన సంవత్సరం రోజున ప్రశాంతత లేకుండా చేసిన 31వ డివిజన్ కార్పొరేటర్ షాలిని భర్త బర్నాబాసు, 32వ డివిజన్ కార్పొరేటరు నెల్లూరు మదన్ మోహన్‌రెడ్డిలను ఎస్పీ తన బంగళాలో గోడ కుర్చీ వేయించిన విషయం కాస్త ఆలస్యంగా బయటపడింది. బర్నాబాసు జులాయి అని పొదలకూరు రోడ్డులో ఎవర్ని అడిగినా చెప్తారు. ఇటువంటి వాళ్లనేకదా మన ఎమ్మెల్యే వివేకానందరెడ్డి చేరతీసేది. జులాయి అనేది పెద్ద అర్హతగా భావించి బర్నాబాసు భార్య షాలినికి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇచ్చింది గాక బర్నాను ఏకంగా నెల్లూరు నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుణ్ని చేసాడాయన. నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి స్వగ్రామం అల్లూరు మండలం నార్తుమోపూరు. ఆ వూర్లో బాగానే వుండిన ఆయన నెల్లూరు వచ్చి చెడిపోయాడు. 32వ వార్డులో గెలిచాక ఆయనకు పట్టపగ్గాలు లేవు. అల్లూరు ఎమ్మెల్యే విష్ణు శిష్యుడు కావడం వల్ల మదన్‌మోహన్‌రెడ్డికి కప్పరాళ్లతిప్పలో పేరుమోసిన దొంగలతో స్నేహం వుంది. వారి సహకారంతో డివిజన్‌లో దౌర్జన్యకర పోకడలకు పోవడం నేర్చుకున్నాడు. 31వ తేదీ బర్నాబాసు, మదన్ మోహన్ రెడ్డిలు తన బంగళాకు కూతవేటు దూరంలో సృష్టించిన ఆగం ఎస్పీ మల్లారెడ్డికి కోపం తెప్పించింది. 2వ తేదీ వన్ టౌన్ ఎస్ఐ చెంచుబాబును పిలిచి వారిద్దరిని తన వద్ద హాజరుపర్చమన్న ఎస్పీ... వారు రాగానే ఏరా... మీరు రౌడీలా.... బట్టలూడదీసి బజారు వెంబడి తిప్పుతా నాయళ్లారా అంటూ గుడ్లు ఉరిమారు. అంతటితో ఊరుకోక తన ఛాంబర్‌లో వారిద్దరి చేత గోడ కుర్చీ వేయించారు. ఇక నుంచి గొడవల్లో మీ పేరు వినిపిస్తే రౌడీషీట్ తెరుస్తానని హెచ్చరించారు. అంతటితో ఆగక నేను ఫ్యాక్షనిస్టుల జిల్లాలో పని చేసి వచ్చాను. మీలాంటి బచ్చాగాళ్లను ఎంత మందిని చూశానో లెక్కలేదు. గౌరవంగా బతికేది నేర్చుకోండి. పశువుల్లా మారితే కసాయి కొట్టుకు పంపిస్తాననేసరికి బర్నాబాసు, మదన్ మోహన్ రెడ్డి ముఖాల్లో నెత్తురుచుక్క లేకుండా పోయింది. నెల్లూరులో రౌడీ పంచాయితీలు ఎక్కువయ్యాయి. బర్నాబాసు, మదన్‌మోహన్‌రెడ్డి మందలింపుతోనైనా ఇవి తగ్గుతాయని భావిద్దాం. నెల్లూరు, అల్లూరు ఎమ్మెల్యేల ప్రియ శిష్యులని కూడా చూడకుండా నాయకులుగా మారిన ఇద్దరు రౌడీలను గట్టిగా మందలించినందుకు ఎస్పీ మల్లారెడ్డిని మెచ్చుకోని నెల్లూరీయులు లేరు. గో హెడ్ ఎస్పీగారు.

# ఆమె... ఆయన... ఓ ట్రాన్స్‌కో డిఇ!

అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా వుంటే ఎంతటి పనినైనాగానీ అవినీతి, అక్రమాలకు పాల్పడవచ్చునని ఓ ట్రాన్స్‌కో అధికారి చేసి చూపించారు.

నెల్లూరు విద్యుత్ భవన్‌లో ఆపరేషన్ సర్కిల్ డిఇగా సుబ్బరాజు విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పరిధిలో 22 విద్యుత్ సెక్షన్ కార్యాలయాలు, 4 సబ్ డివిజన్ కార్యాలయాలు వున్నాయి. 22 మంది అసిస్టెంటు ఇంజినీర్లు, 4గురు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ల పని తీరును పర్యవేక్షించడం ఈయన బాధ్యత. అయితే ప్రభుత్వ విధులపై దృష్టి సారించకుండా ప్రయివేటు వ్యవహారాలపై మాత్రం ప్రత్యేకదృష్టి సారించి రెండు చేతులనిండా అక్రమంగా సంపాదిస్తున్నాడు.



డిఇగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజు, నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేటర్ నందిమండలం భానుశ్రీ భర్త. భానుశ్రీ; నగర ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రతి పనిలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంటారు. ఎమ్మెల్యే వద్ద తన భార్యకున్న బిరును అడ్డం పెట్టుకొన్న రాజు విద్యుత్ భవన్‌లో పై స్థాయి అధికారి నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకు హడలెత్తిస్తున్నాడు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్వహణ బాధ్యతలను ప్రయివేటు కాంట్రాక్టర్‌కు ట్రాన్స్‌కో అధికారులు అప్పగిస్తుంటారు. ఈ సబ్‌స్టేషన్‌లలో ఐదుగురు వ్యక్తులు షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తారు. వీరిలో నలుగురు ఐటిఐ, ఎలక్ట్రికల్ డిప్లొమా చేసిన వారు, మరొకరు వాచ్‌మెన్‌గా వుంటారు.

> నెల్లూరు ట్రాన్స్‌కో ఆపరేషన్ డిఇ సుబ్బరాజు తన వెనుక ఎమ్మెల్యే వున్నారన్న ధైర్యంతో విద్యుత్ భవన్‌లో చేస్తున్న అవినీతి అక్రమాలకు అడ్డూ అపు లేకుండా పోయింది.



ఐటిఐ డిప్లొమా చేసిన వారికి నెలకు 3,640 రూపాయలు, వాచ్ మెన్‌కి 2,886 రూపాయలు కాంట్రాక్టర్ వేతనంగా అందజేస్తారు. ఇంత వరకు బాగానే వుంది. సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ కాంట్రాక్టు పొందిన వారిని బెదిరించి తనకు కావలసిన వారిని, అర్హత లేకపోయినా సబ్‌స్టేషన్ విధులలో చేర్చుకోవాలంటూ కాంట్రాక్టర్లపై ఒత్తిడితెస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు డిఇ సుబ్బరాజు.



సుబ్బరాజు మాటల్ని లెక్కచేయని కాంట్రాక్టర్ల బిల్లులు మంజూరు చేయక పోవడం, కాంట్రాక్టును రద్దుచేస్తామంటూ కక్ష సాధింపు చర్యలకు పూను కొంటున్నాడు. సుబ్బరాజు ఇంతకు ముందు కన్‌స్ట్రక్షన్ విభాగానికి డిఇగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

ఆ విభాగంలో వచ్చే అవినీతి అమేధ్యం చాలక ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సిఫార్సుతో హైదరాబాద్ నుంచి ఆపరేషన్ సర్కిల్ డిఇగా ఉత్తర్వులు తెచ్చుకోవడం జరిగింది. సుబ్బరాజు కూడా తనకు బాగా కావలసిన వాడు కావడంతో ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లుంది.

తరువాయి 14వ పేజీలో




# ఆడిట్ ఆఫీసులో అడ్డగోలు అవినీతి!

జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఖర్చు చేస్తుంటాయి. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ప్రభుత్వ శాఖలు నిబంధనల ప్రకారం ఖర్చు చేస్తున్నాయా లేదా అని జిల్లా ఆడిట్ కార్యాలయ అధికారులు నిధులకు సంబంధించిన రికార్డులు, రశీదులను తనిఖీ చేస్తుంటారు.

ఆడిట్ అధికారులు రికార్డులను పరిశీలించే క్రమంలో నిధుల ఖర్చుతో పాటు సిబ్బంది జీత భత్యాలపై కూడా దృష్టి సారిస్తుంటారు. అధికారుల పరిశీలనలో నిధుల ఖర్చు, జీత భత్యాలకు సంబంధించి లోపాలున్నట్లు గుర్తిస్తే వెంటనే రిమార్కులు ఫైలులో నోట్ చేసి సంబంధిత అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తారు. ప్రతి ప్రభుత్వ శాఖకు సంబంధించి ఆరునెలలకోసారి ఆడిట్ అధికారులు రికార్డులు పరిశీలిస్తుంటారు. ఇదంతా నిబంధనల ప్రకారం జరగాల్సి వుండగా అందుకు భిన్నంగా ఆడిట్ అధికారులు రికార్డులను పరిశీలిస్తుంటారు. ముందుగానే ఆడిట్ చేయాల్సిన ప్రభుత్వ శాఖను ఎంపిక చేసి అందుకు సంబంధించిన రికార్డులను ఆయా కార్యాలయానికి వెళ్లి పరిశీలించాలి.

అయితే ఆడిట్ కార్యాలయం అధికారులు, సిబ్బంది కార్యాలయాలకు వెళ్లకుండానే నగరంలోని ఏదో ఒక లాడ్జిలో రూము అద్దెకు తీసుకొని ఆడిట్ చేస్తున్నారు. లాడ్జి రూము, భోజన ఖర్చులు అన్ని కూడా ఆడిట్ చేయించుకునే కార్యాలయం అధికారులే భరిస్తుంటారు.


నెల్లూరులోని జిల్లా ఆడిట్ ఆఫీసరు కార్యాలయం.

నిధుల ఖర్చుకు సంబంధించి దుర్వినియోగం జరిగినా, జరగక పోయినా ఆడిట్ చేసే అధికారులకు ఎంతో కొంత ముట్ట చెప్పాల్సి వుంటుంది. ముడుపులు ముట్ట చెప్పకపోతే నిబంధనల ప్రకారం నిధులు ఖర్చు చేయలేదంటూ కొరివి పెడతారు. దీంతో ఎందుకొచ్చిన ఇబ్బంది అనుకొని ఆడిట్ అధికారులు అడిగిన మొత్తాన్ని లేదనకుండా వారి చేతిలో పెడుతున్నారు అధికారులు. దీంతో ఆడిట్ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది అవినీతి సంపాదనతో అనతికాలంలోనే లక్షాధికారులు అవుతున్నారు.

వివిధ ప్రభుత్వ శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఖర్చు చేసిన నిధులపై ఆడిట్ చేసేందుకు అధికారులు వస్తున్నారంటే గతంలో ఆయాశాఖల అధికారులు భయపడేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండానే అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులు సులభంగా బయట పడిపోతున్నారు. ఆడిట్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి అడిగినంత నగదు ఇస్తే అంతా సవ్యంగా వుందంటూ గుడ్డిగా సంతకం చేసి పోతుండడంతో ఆడిట్ విభాగం అధికారులంటేనే చులకనగా చూసే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయట పడక పోవడంతోపాటు మరుగున పడిపోతున్నాయి. ప్రభుత్వశాఖలకు కేటాయిస్తున్న నిధులను వున్నతాధికారులు కాకి లెక్కలు వ్రాసి స్వాహా చేస్తుంటారు. దీంతో నిధుల ఖర్చుకు సంబంధించిన లెక్కలు చూసి లోటుపాట్లను గుర్తించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఆడిట్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆడిట్ విభాగం అధికారులు మాత్రం ప్రభుత్వ సంకల్పాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించడంతో పాటు లక్ష్యాలను నీరుగారుస్తున్నారు.

ఇదిలా వుండగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ చేసిన వారి పరిస్థితి మరీ దయనీయంగా వుంటుంది. పదవీవిరమణ చేసిన వారికి అరియర్స్, పెన్షన్ సంబంధించి కూడా ఆడిట్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి వుంటుంది. ఇందుకు ఆరు నెలల ముందే వుద్యోగం చేస్తున్న కార్యాలయం నుంచి సర్వీస్ రికార్డు, ఎంత అరియర్స్ రావాలో, పెన్షన్ మంజూరుకు సంబం

తరువాత 14వ పేజీలో

## సినిమా సమీక్ష

అల్లూరు రహీం

# సమకాలీన రాజకీయాలను ఏకిపారేసిన ఆపదమొక్కులవాడు!

తెలుగు సినీ పరిశ్రమలో విధ్వంసక పేలుడు పదార్థం ఆర్డీఎక్స్ వంటివాడు రచయిత, దర్శకుడు కూడా అయిన పోసాని కృష్ణమురళి. సమాజంలోని కుళ్లు, కపటం, రాజకీయ భ్రష్టతను తన సినిమాల్లో తూర్పార బడుతుంటారాయన. రాష్ట్రంలో సమకాలీన రాజకీయ రంగంలోని అపసవ్యాలను ఎత్తి చూపుతూ, దానికి తనదైన శైలిలో పరిష్కారాలు చూపుతూ ఆయన తీసిన తాజా చిత్రమే ఆపదమొక్కులవాడు. అతి సర్వత్ర వర్జయేత్ అని పెద్దలెప్పుడో చెప్పారు. ఆపదమొక్కులవాడు చిత్రంలో చూపించిన సన్నివేశాలు. చర్చించిన అంశాలు మరీ అతికిపోయాయి. కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులు చూడలేక హడలి కళ్లు మూసుకోవాల్సిన పరిస్థితి. టైటిల్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని పొగుడుతూ ఆయన ఫోటో చూపెట్టి చిత్రంలో ఆద్యంతం ఆయన పాలనను మెత్తటి చెప్పుతో కొట్టాడు. ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు నాయుడు మాట్లాడే తీరులోనే బాబూ మోహన్ చేత ప్రతిపక్ష నాయకుడి పాత్ర వేయించి ఆయన్ను దునుమాడాడు. ఐదారు సన్నివేశాల్లో అనూహ్యంగా ఇంకా రాజకీయాల్లోకి రాని మెగాస్టార్ చిరంజీవికి ఏం తక్కువని పొగిడారు. విచిత్రంగా ఈ చిత్రంలో కోస్తాలో పెద్ద నాయకుడు, గుంటూరు ఎమ్పీ రాయపాటి సాంబశివరావు ముఖ్యమంత్రి పాత్రను పోషించారు. రాజకీయ విశ్లేషకుని పాత్రలో తెరాస ఎమ్పీ ప్రకాష్ కూడా కనపడతారు. రాజకీయ అంశాలతో సాగే చిత్రాలలో కథా చర్చ కొన్ని అంశాలకే పరిమితమైతే బాగుంటుంది. ఆపదమొక్కులవాడులో అది జరగక పోవడం వల్ల జనం తల బొప్పి కట్టేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రులు, వితంతు పెన్షన్ల మంజూరు, వరద నిధుల స్వాహా, భూపోరాటం, రియల్ ఎస్టేట్, రోడ్లు, విద్యుత్ కోత, తాగునీరు, బాబాలు, దేవుడు వంటి అంశాలన్నింటిపై దర్శకుడు దాకిరేవు పెట్టేశారు.


'ఆపదమొక్కులవాడు' చిత్రంలో అస్మిత, నాగేంద్రబాబు.

వితంతు పెన్షన్లు మంజూరు చేయను మనిషికి రెండు వేలు అడిగిన ఎమ్మెల్యేని ఓ వితంతువు లం..కొడకా... తప్పుడు నాకొడకా... చెత్త లం..కొడకా అని తిడుతుంది. ఈ ప్రభుత్వం మంచిది. ముఖ్యమంత్రి మంచోడు; కానీ విడుదల చేస్తున్న నిధులు పదిశాతం కూడా వినియోగం కాకుండా మధ్యలో వాళ్లు తినేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టులు వద్దు; పెద్దాసుపత్రుల్లో పాము, తేలు కాట్లకు మందు అందుబాటులో పెట్టండి. ఫ్లోరిన్ నీళ్ల జనం తాగకుండా చూడండి. ఈ ప్రభుత్వం అవినీతిదని అందరూ అంటున్నా పట్టించుకొనేవారు లేరు. స్కాములు ఆగాలంటే ముఖ్యమంత్రి లంచగొండి కాకూడదు. ఈ పాపాలన్నీ భగవంతుడెలా చూస్తున్నాడో వంటి డైలాగులన్నీ రాష్ట్ర ప్రభుత్వాన్ని తూర్పార పట్టేవే. ముఖ్యమంత్రి... ప్రతిపక్ష నాయకుడికి మధ్య అసెంబ్లీలో ఈమధ్య చోటు చేసుకొన్న వాగ్వివాదం.... నోర్మూసుకో... ఇంకా ఇరవై ఏళ్లు అధికారంలో వుంటాం డైలాగులు విని జనం నవ్వుకొంటారు. క్రమశిక్షణ లేకుండా అసెంబ్లీలో బూతులు తిట్టుకొనే వారిని కంట్రోల్ చేయను ఎవరున్నారు? ఐదేళ్ల అసెంబ్లీ సమావేశాలకు 150 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇదంతా జనం సొమ్మే వంటి డైలాగులు జనాన్ని చైతన్య పరుస్తాయి.

ముదిగొండలో జరిగిన పోలీసు కాల్పులు, సత్యసాయిబాబాను అవహేళన చేయడం, దేవుడున్నాడా లేదా అనే చర్చ అవసరమేననాలి. 400 కోట్ల వరద సహాయ స్వాహాను ఆధారం చేసుకొని నడిచే సన్నివేశాలకు నెల్లూరు ప్రేక్షకులకు జిల్లాలో జరిగిన నిధుల స్వాహాలు గుర్తుకు తెస్తాయి. ఓ మనిషి గుండెపై పబ్లిక్ ముందు డ్రిల్లింగ్ చేసే సన్నివేశం, గర్భవతి పొట్టలోనుంచి బిడ్డ చేయి

తరువాత 14వ పేజీలో



# చార్మికి వాస్తు పిచ్చి!

మంత్ర చిత్రం తనకు పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టిందన్న ఆనందంలో హీరోయిన్ ఛార్మి మునిగి తేలుతుంది. బాపు దర్శకత్వంలో తాను నటిస్తున్న తాజా చిత్రం తన జీవితంలో మైలురాయిలా మిగిలిపోతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఛార్మిని పాతకాలం పిల్ల అనవచ్చు. ఆమెకు లెక్కలేనన్ని ఛాందసాలున్నాయి. వాస్తుశాస్త్రం మీద ఆమెకు నమ్మకం జాస్తి. వాళ్ల నాన్న గూర్చి చెబుతూ ఆయన వాస్తు నిపుణులు. ఆయనకు ఆడపిల్లను బయటకు పంపడం ఇష్టం లేదు. నేను సినిమాల్లోకి రావడానికి నాన్నకు నచ్చజెప్పను చాలా కష్టపడాల్సివచ్చింది. బయట ప్రపంచాన్ని గూర్చి రోజూ వింటున్న వార్తలు పెద్దల్లో సాధారణంగా భయాన్ని నింపుతాయి. అలాంటిదే మా నాన్నలోనూ నేను గమనించాను. నిజానికి ఆయన మాటంటే నాకు వేద వాక్కు అందుకే వాస్తు ప్రకారం ఆయన ఏది చెప్పినా 'తు.చ.తప్పకుండా పాటి స్తాను. నేను పెద్ద బంగళా కడితే అందులో ప్రతి అంశం కూడా వాస్తు ప్రకారమే వుంటుందని ఛార్మి వివరించింది.



# అమృతకు బాయ్‌ఫ్రెండ్ కావాలట!

అతిథి చిత్రంలో నటించి తెలుగు ప్రేక్ష కులతోపాటు హీరో మహేష్‌బాబు అభిమానాన్ని పొందిన హీరోయిన్ అమృతారావు తనకు బాయ్ ఫ్రెండ్ లేడంటుంది. పదోతరగతి అమ్మాయిలకే బాయ్‌ఫ్రెండ్స్ వున్న ఈ కాలంలో గ్లామర్ ఫీల్డ్‌వున్న మీకు బాయ్‌ఫ్రెండ్ లేడంటే నమ్మాలా అంటే కచ్చితంగా నమ్మాలి. నాకే కాదు నాలాంటి చాలా మంది అమ్మాయిలకు బాయ్‌ఫ్రెండ్స్ లేరు. సరైన వాడి కోసం ఎదురుచూస్తున్నారు. చిన్న వయస్సులోనే బిజీ కావడం వల్ల బాయ్‌ఫ్రెండ్ లేడు. ఎంతో మంది అంద గాళ్ల కళ్ల ముందు తిరుగుతున్నా మన సుకు నచ్చినవాడు తారస పడలేదు. ఒక వేళ నాకు నచ్చినవాడే ఎదు రైతే ఐలవ్‌యు చెప్పడానికి అస్సలు సంకోచించనం టుందీ గడుసరి.



# రూటు మార్చిన త్రిష!

గత ఏడాది 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' వంటి విజయవంత మైన చిత్రాలలో నటించిన త్రిష ఈ యేడాది గ్లామర్‌పాత్రల పోషణ వైపే మొగ్గు చూపిస్తుంది. తమిళంలో విక్రమ్ సరసన భీమ చిత్రంలో త్రిష ఆరబోసిన అందాలకు అరవ ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. తెలుగులో రవితేజ సరసన త్రిష నటించిన కృష్ణ చిత్రం ఈనెల 12వ తేదీ విడుదలవుతుంది. ఈ చిత్రంలోనూ త్రిష అందాలు ఆరబోసింది. నాగార్జునతో నెల్లూరీయుడు, నిర్మాత శివప్రసాద్‌రెడ్డి, శీనువైట్ల దర్శకత్వంలో తీసే రొమాంటిక్ చిత్రంలో నటించను త్రిష ఒప్పుకొంది. నాగార్జున సరసన చాన్నాళ్లకు వచ్చిన ఛాన్స్‌ను ఏవిధంగా వదలుకోమంటారంటోంది త్రిష. తమిళంలో ఒకే ఒక చిత్రంలోనే నటించను గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన త్రిష తన దృష్టి బాలీవుడ్ వైపు మరల్చి వుంది. అందుకే తెలుగు, తమిళ చిత్రాల్లో భారీ పారితోషికం, పెద్ద హీరోలైతేనే నటిస్తుంది.



# ఆసిన్ ధ్యాసంతా అక్కడే!

తెలుగు, తమిళ, మళయాళ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి ప్రేక్షకుల అభిమానం పొందిన ఆసిన్ హిందీలో రీమేక్ చేస్తున్న గజిని చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రంలో హీరో అమీర్‌ఖాన్ అన్నది అందరికీ తెలిసిందే. ఈ సినిమా ఇంకా పూర్తికాలేదు. కాని ఆసిన్ బాలీవుడ్‌లో తన స్థానాన్ని నిలబెట్టుకొనేందుకు తెగ తాపత్రయ పడుతోంది. అందుకే తన మకాం కూడా ముంబాయికి మార్చేసింది. అక్కడో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకొంది. దగ్గరలోనే మల్టీపెక్స్‌లు, పబ్‌లు, పార్టీ ప్రదేశాలుండే ప్రాంతాన్ని ఆమె ఎంచుకొన్నట్లు బాలీవుడ్‌వర్గాలు చెబుతున్నాయి. ఈ మధ్య తరచూ హిందీ చిత్ర ప్రముఖులు వచ్చే మల్టీపెక్స్‌లకు హాజరవుతూ అందరి నోళ్లలో నానుతుంది. తారె జమీన్ పర్ ప్రత్యేక ప్రదర్శనకు వెళ్లి అక్కడ బాలీవుడ్ ప్రముఖులను ఆకట్టుకొనే తీరులో మాట్లాడిందట. మళయాళంలో ఇస్తేగిస్తే 8 లక్షలు ఇస్తారు. బాలీవుడ్‌లో ఛాన్స్‌కొడితే ఇక తిరుగుండదంటుంది.



# భావన వింత కోరిక

ఒంటరి చిత్రంలో గోపిచంద్ సరసన నటిస్తున్న భావన తమిళ చిత్రాల్లోనూ బిజీగా వుంది. భావన మాటల మరాఠి. ఏ విషయాన్నైనా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడుతుంది. నా దృష్టిలో హీరోయిన్ అంటే నాలుగు పాటలు... పది సీన్లు. అంతకు మించి పవర్‌ఫుల్‌గా ఇప్పటి సినిమాల్లో కనిపించడం లేదు. ఎంత కాదనుకున్నా హీరోయిన్‌కు లైఫ్ టైమ్ నాలుగైదేళ్లే. అదే హీరో అయితే లైఫ్‌లాంగ్ సినిమాల్లో వుండొచ్చు. అందుకే భగవంతుణ్ణి ఓసారి పెద్ద హీరోగా పుట్టించమని కోరుకొంటున్నా. కొంతకాలం హీరోయిన్‌గా పనిచేసి ఆ తర్వాత ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవడం కష్టం. అందుకే నిరంతరం బిజీగా వుండను కార్యాచరణను రూపొందించుకొంటున్నానంది.

Registered : RN 1156 / 57
No. PLG / NL / 9 - 8 / 06


## సంక్రాంతి శుభాకాంక్షలు



ఈ సంక్రాంతి పండుగ
సందర్భంగా ప్రతి ఇల్లు సుఖశాంతులతో వెల్లి విరియాలని
ప్రజలందరు పాడి పంటలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో
కలకాలం వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షిస్తూ...
సంక్రాంతి శుభాకాంక్షలు
తెలియజేస్తున్నాను.

**చదలవాడ కృష్ణమూర్తి**
కాంగ్రెస్ పార్టీనాయకులు

## నర్రవాడలో పేరంటాలు వెంగమాంబ ట్రస్ట్ ఆధర్వంలో సంక్రాంతి సంబరాలు




నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం
నర్రవాడ గ్రామంలో వెలసిన
శ్రీ పేరంటాలు వెంగమాంబ దేవస్థానం సన్నిధిలో
మూడురోజుల సంక్రాంతి సంబరాలు

| | |
|---|---|
| 14-01-2008 సోమవారం | మాజీ మండలాధ్యక్షుడు, మర్రిపాడు పుట్టం బ్రహ్మానందరెడ్డి గారు |
| 15-01-2008 మంగళవారం | మాదాల రాములమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీ మాదాల తిమ్మయ్య గారు |
| 16-01-2008 బుధవారం | ప్రముఖ పారిశ్రామికవేత్త, సీతారాం సాగర్ సాధనకమిటీ కన్వీనర్, శ్రీ బొందల రఘురామిరెడ్డి గారు |

ఉభయకర్తలుగా వ్యవహరిస్తారు.

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఘనంగా జరిగే సంక్రాంతి పేరంటాలు సంబరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, పేరంటాలు తల్లిని దర్శించి ఆ తల్లి కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటూ...
సంక్రాంతి శుభాకాంక్షలతో...

ఎల్లప్పుడూ తల్లి సేవలో...
**పేరంటాలు వెంగమాంబ ట్రస్ట్**, నర్రవాడ.



మాదాల జానకిరాం